

## రాకింగ్ 'రా'

ఓటీటీ హిట్

### ఖూఫియా

**నెట్‌ఫ్లిక్స్:** అక్టోబర్ 5
**తారాగణం:** టబు, ఆశిష్ విద్యార్థి, అలీ ఫాజిల్, వామికా గబ్బి, అజ్మేరీ తదితరులు.
**దర్శకత్వం:** విశాల్ భరద్వాజ్.

స్పై థ్రిల్లర్ చిత్రాలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. పైగా విశాల్ భరద్వాజ్ లాంటి విభిన్న దర్శకుడు తెరకెక్కిస్తే మరింత కిక్ ఉంటుందని ప్రేక్షకుల నమ్మకం. ఆయన తాజాగా దర్శకత్వం వహించిన 'ఖూఫియా' స్ట్రీమింగ్‌లో రికార్డులు సాధిస్తున్నది. టబు, ఆశిష్ విద్యార్థి తదితర వెటరన్ నటీనటులతో విశాల్ చేసిన ప్రయోగం సక్సెస్ సాధించిందనే చెప్పొచ్చు. కథలోకి వెళ్తే కృష్ణ మెహ్రా అలియాస్ కేఎమ్ (టబు) రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) అధికారి. జీవ్ (ఆశిష్ విద్యార్థి) ఆమెకు బాస్. హీనా రెహమాన్ (అజ్మేరీ) సాయంతో నిర్వహిస్తున్న 'ఆపరేషన్ ఆక్టోపస్' చివరి నిమిషంలో బెడిసికొడుతుంది. హీనా దారుణ హత్యకు గురవుతుంది. ఈ ఆపరేషన్ విఫలం కావడానికి 'రా' అధికారి రవి మోహన్ (అలీ ఫాజిల్) కారణమని జీవ్ అనుమానిస్తాడు. అతని కుటుంబంపై నిఘా పెంచుతాడు. ఈ క్రమంలో రవి దేశ రహస్య సమాచారాన్ని విదేశాలకు అమ్ముతున్నట్టుగా గుర్తిస్తారు. 'ఆపరేషన్ బ్రూటస్' పేరుతో రవి వెనుక ఉన్నవాళ్లు ఎవరో కనిపెట్టే ప్రయత్నం చేస్తుంది కేఎమ్. ఈ ఆపరేషన్‌లో రవి భార్య చారు (వామికా గబ్బీ) 'రా' అధికారులకు సాయం చేస్తుంది. ఇంతకీ రవిని 'రా' పట్టుకుందా? అతని వెనుక ఉన్నదెవరు? హీనాకు, రా అధికారి కేఎమ్‌కు ఉన్న సంబంధం ఏంటి? ఇవన్నీ మిగిలిన కథ. మధ్యమధ్యలో సాగదీతగా అనిపించినా.. పతాక సన్నివేశాలు ఆసక్తికరంగా మలచడంతో సినిమా బోర్ కొట్టదు.


నమస్తే తెలంగాణ

# జిందగీ 13

హైదరాబాద్ | ఆదివారం 15 అక్టోబర్ 2023 www.ntnews.com


## థియేటర్లకు మళ్లీ కళ

**కొవిడ్** వల్ల కుదేలైన ఎన్నోరంగాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. కొవిడ్ కాకలో ఉండగానే సినీరంగాన్ని ఓటీటీ తీసిన దెబ్బ అంతా ఇంతా కాదు. పులి మీద పుట్రలా కరోనా కారణంగా థియేటర్లకు దూరమైన ప్రేక్షకులను ఓటీటీ ఇంటిపట్టునే ఉండేలా చేసింది. కొవిడ్ సమసిపోయినా ఓటీటీకి మరిగిన ప్రేక్షకులు థియేటర్లపై మోజు తగ్గించుకున్నారన్నది వాస్తవం. అయితే, తాజా సర్వే సినీజనాలకు ఊరటనిస్తున్నది. యువ ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి మోజు చూపుతున్నారని 'బుక్ మై షో' నిర్వహించిన సర్వేలో తేటతెల్లమైంది. దాదాపు 650 నగరాల్లో దీనిని నిర్వహించగా జెనరేషన్ జెడ్‌లో 41 శాతం మంది, మిలీనియల్స్‌లో 59 శాతం మంది మంచి సినిమాను థియేటర్‌లో చూడటానికే ఆసక్తి కనబరిచారు. ఎంత ఓటీటీ వచ్చినా.. టాకీస్‌లో చూసినప్పుడు కలిగే అనుభూతి వేరని వాళ్లు చెప్పుకొచ్చారు. అంతేకాదు, కాలక్షేపానికి ఎంచుకునే మార్గాల్లో సినిమాదే అగ్రతాంబూలమని అభిప్రాయపడ్డారు. సర్వేలో పాల్గొన్నవారిలో దాదాపు 90 శాతం మంది థియేటర్‌లో సినిమా చూడటానికి ఇష్టం వ్యక్తం చేశారు. అంతేకాదు, ముందస్తుగా సినిమా ప్లాన్ చేసుకుంటున్న వాళ్ల శాతం 74గా నమోదైంది. భాషతో సంబంధం లేకుండా వీకెండ్ మంచి సినిమా చూస్తే చాలనుకుంటున్న వారి సంఖ్య 34 శాతంగా ఉంది. మొత్తంగా యంగ్‌తరంగ్‌ల సినిమా అభిమానం కారణంగా ఇండస్ట్రీకి గడ్డురోజులు తప్పాయని తెలుస్తున్నది. ఈ గజిబిజి జీవితంలో సినిమాను మించిన ఎంటర్‌టైన్మెంట్ ఏముంటుంది చెప్పండి?



## జిందగీలో.. పాటల పల్లకి!

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ఎన్నో బతుకమ్మ పాటలు వినండి.

### పున్నమ్ము నాడల్ల..

**(ఆవు-పులి కథ)**

**పాడినవారు :** కవిత బోటుక,

ఫోన్ నెం : 85230 72218

**పున్నమ్ము నాడల్లా పుట్టి గంగ్యావు**

రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
పుట్టూతా గంగమ్మా ఏమీ గోరింది
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో || ..
పుట్టుతా గంగమ్మా పురుడూ గోరింది
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
పెరుగూతా గంగమ్మ ఏమి గోరింది
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో.. |
| రేగి మాల్లేలోయి, తీగమాల్లేలో ||
పెరుగూతా గంగమ్మ పెండ్లీ గోరింది
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
పాయేనే గంగమ్మ పోలమెగ్గిరానా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
ఎక్కరాని గట్లన్ని ఎక్కెక్కి మేసే
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
దిగరాని గట్లన్ని దిగినీళ్లుతాగే
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
గట్లల్లా నుంచోచ్చే బోట్ల పులిరాజు
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
మింగుతా గంగమ్మ నిన్ను మింగుతా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
నా చిన్ని బసవయ్యకు పాలిచ్చివస్తా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
ముందొచ్చే ఆవుల్లారా మూగావుల్లారా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
మీరందరొస్తిరి మాయమ్మ ఏది
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
నడుమొచ్చె ఆవుల్లారా నల్లావుల్లారా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
ఎనకొచ్చే ఆవుల్లారా ఎర్రావుల్లారా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
మీ అమ్మ పులితోని సేసేబాసల్లా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..
|| రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో ||
ఒచ్చేనే గంగ్యావు ఒలమెగ్గిరానా
రేగి మాల్లేలోయి.. తీగమాల్లేలో..

**ఇంకా ఉంది..**



..పూర్తి పాట వినడానికి స్కాన్ చేయండి.



# తెలుగు నాట కన్నడ కేక

**'కాంతార'ను మన సినిమా అనుకున్నాం. 'కేజీఎఫ్'కు రికార్డు విజయం కట్టబెట్టాం. 'బాయ్స్ హాస్టల్' లొల్లికి మనమూ విరగబడి నవ్వాం. తమిళ హీరోలకు మల్లే కన్నడ నటులకూ కటౌట్లు పెట్టే రోజులు వచ్చేశాయి. తెలుగు టాకీసుల్లో కస్తూరి పరిమళాలు ఈలలు వేయిస్తున్నాయి. ఇప్పటివరకు ఎప్పుడో గానీ.. తెలుగింటి వైపు కన్నెత్తి చూడని కన్నడ సినిమా.. ఈ మధ్య తరచూ వెండితెరపై బంగారు కాంతులీనుతున్నది. తుళు తళుకులను కథానాయికలుగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులు.. కన్నడ డబ్బింగ్ సినిమాలకూ బ్రహ్మరథం పడుతుండటం విశేషం.**

**సాండల్‌వుడ్** అనగానే తెలుగువారికి కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ తప్ప మరెవరూ తెలియని రోజులవి. 1954లో డైరెక్ట్ తెలుగు సినిమా 'కాళహస్తి మహత్యం'లో కన్నప్పగా రాజ్‌కుమార్ నటించాడు. నాటి నుంచీ ఆయనకు తెలుగు రాష్ర్టాల్లో గుర్తింపు చెక్కు చెదరలేదు. 'శ్రీకృష్ణపాండవీయం'లో భీముడిగా కనిపించిన ఓ నటుడి రాజసానికి అప్పట్లో అందరూ ఫిదా అయ్యారు. ఆయనగారు ఎవరా అని ఆరాతీస్తే కన్నడ నటుడు ఉదయ్‌కుమార్ అని తెలిసింది. ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ తెలుగులో చాలా చిత్రాల్లో వయసు మళ్లిన పాత్రలు పోషించాడు. కన్నడ నటుడు అనంత్‌నాగ్ చిత్రాలు అప్పట్లో తెలుగులోకి డబ్ అయ్యేవి. రాజ్‌కుమార్ తనయుడు శివ రాజ్‌కుమార్‌కు కూడా తెలుగులో మంచి క్రేజ్ ఉంది. అడపాదడపా అతిథి పాత్రల్లో మెప్పిస్తూనే ఉంటాడు. ఆయన నటించిన కొన్ని చిత్రాల డబ్బింగ్‌లకు తెలుగులో మంచి గుర్తింపే వచ్చింది. బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'గౌతమీపుత్ర శాతకర్ణి'లో అతిథి పాత్ర పోషించిన శివరాజ్‌కుమార్.. తాజాగా మంచు విష్ణు లీడ్‌రోల్‌గా నిర్మితమవుతున్న 'భక్త కన్నప్ప'లో కీలక పాత్రలో కనిపిస్తున్నాడట. మరోవైపు తెలుగు రాష్ర్టాల్లో వీరందరికీ దక్కని గుర్తింపు దర్శక, నటుడు ఉపేంద్రకు వచ్చింది. ఆయన నటించిన కన్నడ చిత్రాలు 'ఎ', 'ఉపేంద్ర', 'రా', 'సూపర్‌స్టార్' తెలుగులో డబ్ అయి రికార్డు కలెక్షన్లు సాధించాయి. తర్వాత దాదాపు రెండు దశాబ్దాలపాటు కన్నడ చిత్రాలు ఒకటి అరా తప్ప పెద్దగా తెలుగులోకి రాలేదు. రెండుమూడేండ్లుగా కన్నడ చిత్రాలు తెలుగులోకి క్యూ కడుతున్నాయి. దండుపాళ్యం నుంచి మొదలైన దండయాత్ర ఇటీవల జోరందుకుంది. 'కేజీఎఫ్', 'కాంతార' సినిమాలు తెలుగు రాష్ర్టాల్లో విజయదుందుభి మోగించాయి. '777 చార్లీ', 'కబ్జా' చిత్రాలు కూడా తెలుగులో విడుదలై మంచి క్రేజ్ సంపాదించాయి.

**పొరుగింటిలో** పసందైన పాకం ఘుమఘుమలు ముక్కుపుటాలను అదరగొడితే.. ఎలా చేశారో తెలుసుకొని వండుకోవడం ఒక పద్ధతి. రిస్క్ ఎందుకని వాళ్లనే వండి పెట్టమనడం రెండో పద్ధతి. మొదటి విధానంలో బిర్యానీ సక్సెస్ అవుతుందన్న గ్యారెంటీ తక్కువే! రెండో విధానం పక్కాగా విజయం సాధిస్తుంది. డబ్బింగ్ అలాంటిదే! మార్పులు, చేర్పులతో రీమేక్ ఒక్కోసారి దెబ్బతినే అవకాశం ఉంటుంది. కానీ, డబ్బింగ్ విషయంలో ఈ ఇబ్బంది ఉండదు. సక్సెస్ రేటు అన్ని ప్రాంతాల్లోనూ ఒకేవిధంగా ఉంటుంది. కన్నడలో విజయం సాధిస్తున్న సినిమాలు చాలావరకు తెలుగులోనూ రికార్డులు సృష్టిస్తున్నాయి. మార్కెట్‌ను విస్తరించే ప్రయత్నంలో భాగంగా కన్నడ సినీ ఇండస్ట్రీ సైతం మంచి సినిమాలను రీమేక్ కన్నా.. డబ్బింగ్‌కే తొలి ప్రాధాన్యం ఇస్తున్నది.



### 'కాంతార' వావ్

విడుదలైన రెండో రోజు నుంచి 'కాంతార' కేక మొదలైంది. కథ, కథనం ప్రాంతాతీతమైనా... తెలుగువారూ ఈ చిత్రాన్ని తమదే అన్నట్టుగా సొంతం చేసుకున్నారు. హీరో రిషబ్ శెట్టి దర్శకత్వ ప్రతిభను వేనోళ్లా పొగిడారు. మట్టి పరిమళాలు అద్దుకున్న కథకు దైవత్వాన్ని జోడించడంతో మాస్టర్ పీస్‌గా నిలిచిపోయింది కాంతార. భూతకోల ఆచారాన్ని చూపించిన తీరు, పంజుర్లిగా రిషబ్ నటన కాసుల వర్షం కురిపించింది. తెలుగు, కన్నడ సినిమాల మధ్య ఉన్న చిన్న డబ్బింగ్ గీతను ఈ చిత్రం చెరిపేసింది అనడంలో సందేహం లేదు. అంతకుముందు 'కేజీఎఫ్' చిత్రాలు కాసులు కొల్లగొట్టినా.. కమర్షియల్ హంగులు లేకపోయినా కథ పండితే డబ్బింగ్ సినిమా కూడా చక్కటి విజయం సాధిస్తుందని కాంతార రుజువు చేసింది.

### 'కేజీఎఫ్' మార్క్

ప్రశాంత్ నీల్, యశ్ మాయాజాలం 'కేజీఎఫ్'. టేకింగ్‌లో కొత్తదనం ఈ సినిమాపై నిర్మాణ సమయం నుంచే ఆసక్తి రేకెత్తించింది. భారీ తారాగణం అదనపు బలం. కోలార్ బంగారు గనుల కథా నేపథ్యం కూడా బాగా కలిసొచ్చింది. హీరోయిజం, విలనిజం సమంగా పండటంతో 'కేజీఎఫ్' ఉభయ చిత్రాలూ భారతీయ సినిమా తెరపై భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌గా గుర్తింపు సాధించాయి. తెలుగు డబ్బింగ్‌తోపాటు తమిళం, హిందీ వెర్షన్లు కూడా కలెక్షన్ల సునామీ సృష్టించాయి. యశ్‌కు ఎక్కడలేని క్రేజ్ వచ్చిపడింది. దర్శకుడు ప్రశాంత్ నీల్‌కు తెలుగు హీరోలు రెడ్ కార్పెట్ పరిచారు.

### సూపర్ 'విక్రాంత్'

కన్నడ స్టార్ 'కిచ్చ' సుదీప్ తెలుగువారికి సుపరిచితుడే! 'ఈగ' సినిమాలో ఆయన పండించిన విలనిజంతో ఇక్కడ కూడా ఓవర్‌నైట్ స్టార్ అయిపోయాడు. ఆ తర్వాత ఆయన కన్నడంలో నటించిన చిత్రాలు కొన్ని తెలుగులోకి డబ్ అయి ఎంతోకొంత డబ్బు కొల్లగొట్టాయి. 'బాహుబలి', 'సైరా నరసింహారెడ్డి' తదితర డైరెక్ట్ తెలుగు సినిమాల్లోనూ సుదీప్ కీలక పాత్రలు పోషించాడు. వీటన్నిటికీ మించి గతేడాది విడుదలైన 'విక్రాంత్ రోణా' తెలుగు బాక్సాఫీస్ దగ్గర సుదీప్ స్టామినాను తెలియజేసింది. కన్నడంలో నిర్మించిన ఈ సినిమా తెలుగు డబ్బింగ్‌కు తెలుగు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. అంతేకాదు, ఈ చిత్రంతో తెలుగు రాష్ర్టాల్లో ఈ కన్నడ స్టార్ మార్కెట్‌ను పెంచుకున్నాడు కూడా!

### కామెడీ కిచిడి

ఈ ఏడాది కన్నడ చిత్రసీమను దున్నేసిన చిత్రాల్లో ఒకటి 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. నితిన్ కృష్ణమూర్తి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు హీరో కథనమే! 'జాతిరత్నాలు' టైప్ సిల్లీకామెడీతో సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాన్ని రూపొందించి తెరపై విడిచిపెట్టాడు దర్శకుడు. డిఫరెంట్ జానర్ కావడంతో కన్నడ ప్రేక్షకులు ఈ చిత్రానికి బ్రహ్మరథం పట్టారు. అదే ఉత్సాహంతో దీన్నే తెలుగులో 'బాయ్స్ హాస్టల్' పేరుతో డబ్బింగ్ వెర్షన్ విడుదల చేశారు. ఇక్కడా అదే రేంజ్ విజయాన్ని సొంతం చేసుకుంది. చిన్న చిత్రాలకూ తెలుగులో మార్కెట్ ఉందని నిరూపించింది 'బాయ్స్ హాస్టల్'. ఇటీవల ఓటీటీలో కన్నడ వెర్షన్ రిలీజైంది. తెలుగు రాష్ర్టాల్లోనూ రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేస్తుండటం విశేషం.

### 'ఏడు సంద్రాల' సంతసం

ఫీల్ గుడ్ చిత్రాలను రీమేక్ చేస్తే ఫలితం బెడిసి కొడుతుందని '96' రుజువు చేసింది. విజయ్ సేతుపతి, త్రిష జంటగా నటించిన ఈ తమిళ సినిమాను తెలుగులో శర్వానంద్, సమంతతో 'జాను'గా రీమేక్ చేసి దిల్ రాజు చేతులు కాల్చుకున్నాడు. అదే డబ్ చేసి ఉంటే తప్పకుండా విజయం సాధించి ఉండేదని విశ్లేషకుల



అభిప్రాయం. ఈ సంగతి అటుంచితే ఇటీవల కన్నడలో చడీచప్పుడు లేకుండా వచ్చి సముద్రమంత హోరు సృష్టించిన చిత్రం 'సప్తసాగర దాచె ఎల్లో'. తెలుగులో 'సప్త సాగరాలు దాటి- సైడ్ ఏ' పేరుతో డబ్బింగ్ వెర్షన్ విడుదలైంది. ఇక్కడ కూడా నిదానంగా హిట్ టాక్ సొంతం చేసుకుంది. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమా సెకండ్ పార్ట్ కోసం సైడ్ ఏ చూసిన ప్రేక్షకులు కండ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారంటే అతిశయోక్తి కాదు.



**అందంతో ఆకట్టుకునే నటులు ఉంటారు. అభినయంతో కట్టిపడేసేవారూ ఉంటారు. ఈ రెండూ కలగలసిన అభినేత్రి విద్యాబాలన్. సంక్లిష్టమైన పాత్రలను పోషించడంలో ఆమె దిట్ట. సరదా పాత్రలనూ హుందాగా పండిస్తుంది. వెటరన్ నటిగా మారిపోతున్నా.. ఇప్పటికీ ఆమె కోసం తరచూ పాత్రలు పురుడు పోసుకుంటూనే ఉన్నాయి. జయాపజయాలతో సంబంధం లేకుండా నటిగా సక్సెస్‌కు కేరాఫ్‌గా నిలిచిన విద్యాబాలన్ అంతరంగం ఆమె మాటల్లోనే..**

## అన్ని డైలాగులూ చెప్పేశా!

**నా** మొదటి సినిమా షూటింగ్ సమయంలో చిత్రమైన అనుభవం ఎదురైంది. స్క్రిప్ట్‌లో ఉన్నట్టుగానే నటించమంటే నాకు చేతకాదు. సందర్భోచితంగా కొంత మార్చేస్తుంటాను. ఆ చిత్ర దర్శకుడు దీనిని గమనించి.. 'స్క్రిప్ట్‌లో లేదు కదా' అన్నట్టుగా చూశాడు. 'బాగుంది కదా!' అన్నట్టుగా నేనూ లుక్కిచ్చా! ఆయన ఓకే చేశారు. సన్నివేశం డిమాండ్ చేసినప్పుడు తెలియకుండానే మన ఎక్స్‌ప్రెషన్స్, డైలాగ్‌లు కూడా మారిపోతుంటాయి. దర్శకుడి అంగీకారంతోనే ఇలాంటి ప్రయోగాలు చేసేదాన్ని.

**నా** కెరీర్‌లో చాలెంజ్ తీసుకొని చేసిన చిత్రం 'డర్టీ పిక్చర్'. సిల్క్ స్మిత జీవితం పైకి కనిపించినంత అందమైనది కాదు. ఎన్నో కష్టనష్టాలను అనుభవించింది. ఆమెది ఒంటరి జీవనం. ఆ కథ నన్నెంతో ఆకట్టుకుంది. కానీ, స్మిత అనుభవించిన బాధను నేను పండించగలనా అని చాలాసార్లు అనుకున్నా! మొత్తానికి మెప్పించగలిగా!

**నేను** ఏదైనా సినిమా ఒకేసారి చూస్తాను. రెండోసారి చూడటం అత్యంత అరుదు. అలాంటిది 'కుచ్ కుచ్ హోతా హై' నాలుగుసార్లు చూశాను. ఆ సినిమాలో అన్ని పాత్రల డైలాగ్‌లు నేను చెప్పేసేదాన్ని. అంతలా ఆ చిత్రం నన్ను ఆకట్టుకుంది.

**'భూల్** భులయా' సినిమా సమయంలో దర్శకుడు ప్రియదర్శన్ నాతో 'చంద్రముఖి సినిమా మాత్రం చూడకు' అని చెప్పారు. మాతృక చూస్తే ఆ నటన ప్రభావం మనపై ఉంటుందని ఆయన అభిప్రాయం. నిజమే కదా! దర్శకుడు కథ చెబుతున్నప్పుడు మన కండ్లముందు ఒక పాత్ర కనిపిస్తుంది. మనం నటిస్తున్నప్పుడు దర్శకుడు కూడా మనం చూసిన పాత్రనే చూడగలిగితే నటిగా సక్సెస్ సాధించినట్టే. ఆ సినిమా నాకు మంచి పేరు సాధించిపెట్టింది.

**ఎవరో** వచ్చి మనల్ని ఉద్ధరిస్తారు అనుకుంటే పొరపాటు. మన జీవితాన్ని ఎవరో తీర్చిదిద్దరు. ఎవరో పాడుచేయరు. బాగుపడ్డా, నాశనమైనా అందుకు కర్త, కర్మ, క్రియ అన్నీ మనమే! నేను ఈ విషయాన్ని బలంగా విశ్వసిస్తాను. అందుకే, కెరీర్‌తోపాటు వ్యక్తిగత జీవితమూ అందంగా ఉండేలా చూసుకుంటాను. అంటే తప్పులు చేయనని కాదు. చేసిన తప్పులను దిద్దుకోవడంలోనే మన జీవితం ఆధారపడి ఉంటుంది.